సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 23 । జనవరి । 2024



తూనికలపై అవగాహన అవసరం

తూనికలు, కొలతలపై వినియోగదారులు అవగాహన పెంచుకోవాలని తూనికలు,కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ తెలిపారు.

10లో

నేడు అష్టదళ పద్మారాధన



డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు.



వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది.



పూజలందుకున్న సుండ్రుపుట్టు రామాలయంలోని సీతారాములు

గ్రామగ్రామానా
రామ నామం

- ఇంటింటా ఆధ్యాత్మిక జ్యోతులు
- ప్రత్యేక పూజలు,శోభాయాత్రలు

సాక్షి,పాడేరు: అయోధ్య రామాలయంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం జిల్లా అంతటా రామనామం మార్మోగింది. ఇంటింటా రామజ్యోతులు వెలిగించారు. గ్రామగ్రామానా జగదభిరాముడికి ప్రత్యేక పూజలు, శోభా యాత్రలు జరిపారు. ఈ వేడుకల్లో భారీ ఎత్తున భక్తులు పాల్గొన్నారు. రామాలయాలు, ఆంజనేయస్వామి గుడుల వద్ద అర్చనలు, భజనలు నిర్వహించారు.

జిల్లా కేంద్రమైన పాడేరుతో పాటు అన్ని గ్రామాల్లో ఆధ్మాత్మిక వాతావరణం నెలకొంది. పాడేరులోని సుండ్రుపుట్టు రామాలయంలో సీతా రాముల లక్ష్మణ,ఆంజనేయ స్వామి విగ్రహాలకు పూజలు చేశారు. సాయంత్రం సీతారాముల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుదీర్చి పాడేరు వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు.రాత్రి ఆలయ ప్రాంగణంలో మహిళలంతా దీపార్చన చేశారు. చింతూరులోని కోదండరామ స్వామి ఆలయం, వీఆర్‌పురం మండలంలోని శ్రీరామగిరిపై కొలువుదీరిన సుందర సీతారామచంద్రస్వామి ఆలయం, గంగవరం, జి.మాడుగుల, జీకే వీధి, కొయ్యూరు తదితర గ్రామాల్లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు, దీపారాధన నిర్వహించారు.



పాడేరులో సీతారాముల విగ్రహాలతో శోభా యాత్ర నిర్వహిస్తున్న భక్తులు



సీలేరులో పూజలందుకున్న సీతారాములు



కూనవరంలో స్వామివారి ఊరేగింపు



రాజవొమ్మంగి కోదండ రామస్వామి ఆలయంలో భజనలు చేస్తున్న భక్తులు



సుండ్రుపుట్టు రామాలయం వద్ద దీపారాధన

చూడ'చెక్క'ని రాముడు

- గిరిజన తండాలో ప్రత్యేక పూజలు



అప్పలరాజుపేట గ్రామంలో పూజలందుకొంటున్న చెక్కరూపంలోని రాముడు

రాజవొమ్మంగి: వందకు పైగా కుటుంబాలు గల మండలంలోని అప్పలరాజుపేటలో దాదాపు ఐదు దశాబ్దాలుగా అక్కడి గదబల సామాజిక వర్గానికి చెందిన ఆదివాసీలు చెక్కనే రామునిగా భావించి పూజలు చేస్తున్నారు. అయోధ్యలో సోమవారం బాల రాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని ఆ చెక్కకు ప్రత్యేక పూజలు చేశారు. పలు రకరకాల వంటకాలు నివేదించారు. అనంతరం యువత అన్నసంతర్పణ జరిపారు. తమ గ్రామంలో రామాలయం నిర్మాణానికి సహాయసహకారాలు అందించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

న్యూస్‌రీల్

రహదారి భద్రతా ప్రమాణాలు పాటించాలి

- ఐటీడీఏ పీవో కావూరి చైతన్య



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీవో చైతన్య

చింతూరు: జీవితం ఎంతో విలువైనదని, దానిని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ రహదారి భద్రతా ప్రమాణాలు పాటించాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య తెలిపారు. 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో రవాణా శాఖకు సంబంధించిన పోస్టర్‌ను పీవో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎంవీఐ ఆనందరావు మాట్లాడుతూ వాహనదారులకు రహదారి భద్రతపై పూర్తి అవగాహన కల్పించడంలో భాగంగా ఇతర శాఖల సహకారంతో సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవీఐ శ్వేత పాల్గొన్నారు.


25న సెల్ టవర్ల ప్రారంభం



లైగండ సెల్ టవర్ పరిశీలిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

డుంబ్రిగుడ: జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసిన 278 సెల్ టవర్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో ఈ నెల 25న ప్రారంభించనున్నట్టు పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. మండలంలోని లైగండలో కొత్తగా ఏర్పాటు చేసిన సెల్‌టవర్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ టవర్ నిర్మాణం వల్ల మారుమూల గ్రామాల ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ వేణుగోపాల్, ఏఈ అభిషేక్, ఎంపీడీవో ఉషారాణి,తహసీల్దార్ నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఓటర్ల జాబితా సవరణ'పై సంతృప్తి



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న శ్యామలరావు, సుమిత్‌కుమార్, కార్తీక్

సాక్షి,పాడేరు: ఓటర్ల జాబితా సవరణపై ఎలక్టోరల్ రోల్ పరిశీలకులు,ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు సంతృప్తి వ్యక్తం చేశారు. పాడేరు నియోజకవర్గంలోని వంట్లమామిడి,వంతాడపల్లి, శ్రీకృష్ణాపురం పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియకు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించారు. అనంతరం పీఎంఆర్‌సీ భవనంలో ఓటర్ల సవరణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్,జేసీ కార్తీక్,ఐటీడీఏ పీవో వి.అభిషేక్,స్థానిక తహసీల్దార్ త్రినాథరావునాయుడు పాల్గొన్నారు.

జిల్లాలో ఓటర్లు
7,61,255

- తుది జాబితా విడుదల
- మహిళా ఓటర్లే అధికం
- మహిళలు 3,94,832 మంది
- పురుషులు 3,66,386 మంది
- ఇతరులు 37 మంది
- తుదిజాబితాలో పెరిగిన ఓటర్లు 20,682 మంది



కొత్త ఓటరు జాబితాను విడుదల చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



సాక్షి,పాడేరు: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లాలోని ఓటర్ల తుదిజాబితాను సోమవారం విడుదల చేశారు. జిల్లాలో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. అరకులోయ, పాడేరు, రంపచోడవరం ఎస్టీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ మూడింటిలో మొత్తం ఓటర్లు 7,61,255 మంది ఉన్నారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్‌కు ముందు 7,40,573 మంది ఓటర్లు ఉండేవారు. మరణించిన , వలసలు వంటి కారణాలతో 19,394 ఓటర్లను తొలగించారు.

కొత్త ఓటర్లు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్ల దరఖాస్తులను పరిశీలించి, 40,076 మందికి చోటు కల్పించారు. మార్పులు, చేర్పుల అనంతరం జిల్లాలో కొత్తగా 20,682 మంది ఓటర్లు పెరిగారు.

తుది ఓటర్ల జాబిత ప్రకారం జిల్లాలో 1,021 పోలింగ్ కేంద్రాల పరిధిలో 3,94,832 మంది మహిళా ఓటర్లు, 3,66,386 మంది పురుష ఓటర్లు, ఇతరులు 37మంది కలిపి మొత్తం 7,61,255 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో 13 పోలింగ్ కేంద్రాలను పెంచారు.

నియోజకవర్గాల వారీగా వివరాలు

అరకులోయ నియోజకవర్గంలోని 304 పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,17,460 మంది పురుష ఓటర్లు, 1,23,894 మంది మహిళా ఓటర్లు, ఇతరులు ఆరుగురు కలిపి మొత్తం 2,41,360 మంది ఓటర్లు ఉన్నారు. పాడేరు నియోజకవర్గంలో 318 పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,18,154 మంది పురుష ఓటర్లు, 1,26,755 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 16 కలిపి మొత్తం 2,44,925 మంది ఓటర్లున్నారు. రంపచోడవరం నియోజకవర్గంలో 399 పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,30,772 మంది పురుష ఓటర్లు, 1,44,183మంది మహిళా ఓటర్లు, ఇతరులు 15 మంది కలిపి మొత్తం 2,74,970 మంది ఓటర్లున్నారు.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ముంచంగిపుట్టు	18,405	19,312	2	37,719
పెదబయలు	20,798	21,169	1	41,968
హుకుంపేట	21,567	23,495	1	45,063
డుంబ్రిగుడ	18,468	19,512	1	37,981
అరకులోయ	20,111	21,599	1	41,711
అనంతగిరి	18,111	18,807	0	36,918
జీకే వీధి	25,188	25,695	2	50,885
కొయ్యూరు	20,588	22,589	1	43,178
చింతపల్లి	30,197	32,944	3	63,144
జి.మాడుగుల	21,381	22,399	7	43,787
పాడేరు	20,800	23,128	3	43,931
అడ్డతీగల	14,618	16,111	2	30,731
చింతూరు	14,162	15,548	2	29,712
దేవీపట్నం	9,930	11,045	1	20,976
గంగవరం	10,361	11,467	1	21,829
కూనవరం	9,365	10,832	3	20,200
మారేడుమిల్లి	7,238	8,049	0	15,287
రంపచోడవరం	13,967	15,864	0	29,831
రాజవొమ్మంగి	15,369	16,269	0	31,638
వి.ఆర్.పురం	9,427	10,347	2	19,776
వై.రామవరం	10,484	11,672	1	22,157
ఏటపాక	15,851	16,979	3	32,833
మొత్తం	3,66,386	3,94,832	37	7,61,255

కాఫీ రైతుల ఆర్థికాభివృద్ధే జీసీసీ లక్ష్యం

- జీసీసీ ఎండీ సురేష్‌కుమార్



కాఫీ రైతులకు టార్పాలిన్‌లను పంపిణీ చేస్తున్న సురేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలో కాఫీ రైతుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా జీసీసీ పనిచేస్తోందని జీసీసీ ఎండీ సురేష్‌కుమార్ తెలిపారు. పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల మండలాల్లోని 40 మంది కాఫీ రైతులకు జీసీసీ ఉచితంగా టార్పాలిన్లు పంపిణీ చేస్తోంది. దీనిలో భాగంగా మోదాపల్లిలో కాఫీ రైతులకు సోమవారం ఆయన టార్పిలిన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు ఉత్పత్తి చేసిన కాఫీ గింజలను ప్రతి ఏడాది గిట్టుబాటు ధరతో జీసీసీ కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. కాఫీ రైతులకు రుణాలు పంపిణీతో మరింత మేలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీసీసీ సీనియర్ మేనేజర్ శ్రీనివాసరావు, పాడేరు డీఎం డి.సింహాచలం పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

- కలెక్టర్ సుమిత్‌కుమార్



రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లాకు చేరిన ఓటర్ల జాబితాల ప్రతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల సవరణ అనంతరం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తుదిజాబితాను విడుదల చేసినట్టు చెప్పారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాలలో డ్రాఫ్ట్ పబ్లికేషన్ అనంతరం ఓటర్ల సంఖ్య 7,40,573 నుంచి 7,61,255కు పెరిగిందన్నారు. అదనంగా 13 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో 286 పోలింగ్ కేంద్రాలకు మొబైల్ సిగ్నల్ లేనట్టుగా గుర్తించామని చెప్పారు. ఓటర్ల జాబితాలను అన్ని రాజకీయ పార్టీలకు అందజేశారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల జాబితాలను ప్రదర్శిస్తున్నామని, బూత్ లెవెల్ ఏజెంట్ల ద్వారా పరిశీలన జరిపి నివేదికలు అందజేస్తే నిబంధనల మేరకు అనుబంధంలో ముద్రిస్తామని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు సీదరి మంగ్లన్నదొర, డి.వెంకటరమణ,రాఘవేంద్రరావు, కె.బాలకృష్ణ, చిన్నయ్యదొర, వంశీకృష్ణ, వి.హెచ్.దాస్‌లు పాల్గొన్నారు.

దుబాయి వరల్డ్ కాన్ఫరెన్స్‌లో మేడికొండ ట్రైబల్ కాఫీ ప్రదర్శన



దుబాయి వరల్డ్ కాఫీ కాన్ఫరెన్స్‌లో ప్రదర్శించిన మేడికొండ ట్రైబల్ కాఫీ

జి.మాడుగుల: మండలంలోని మేడికొండ ట్రైబల్ కాఫీకి అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తున్నట్టు రైతు సాధికార సంస్థ సీఈవో పరదాని గంగరాజు తెలిపారు. జి.మాడుగుల మండలం సింగర్భ పంచాయతీ ఎం.నిట్టాపుట్టుకు చెందిన గిరిజన రైతు సాధికార సంస్థ మేడికొండ ట్రైబల్ కాఫీ సబ్‌కో, కృతి కాఫీ కంపెనీల ద్వారా దుబాయి వరల్డ్ కాఫీ కాన్ఫరెన్స్‌లో సోమవారం లాంచింగ్ చేసినట్టు ఆయన తెలిపారు. ఈ వరల్డ్ కాఫీ కాన్ఫరెన్స్ ఈ నెల 21నుంచి 23వరకు జరుగుతుందని ఆయన చెప్పారు. గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో అరకు కాఫీని బెంగళూరులో సంస్థలకు పరిచయం చేసిన మాదిరిగానే తమ సంస్థ ద్వారా మేడికొండ ట్రైబల్ కాఫీనిదుబాయిలో కంపెనీలకు పరిచయం చేస్తున్నామని ఆయన తెలిపారు. ప్రకృతి సిద్ధంగా తయారైన ట్రైబల్ కాఫీకి మంచి స్పందన వస్తోందన్నారు.

క్రీడలతో ఉన్నత శిఖరాలకు



క్రికెట్ విజేత జోలాపుట్టు జట్టుకు బహుమతి అందజేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్

- జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర



బ్యాటింగ్ చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: క్రీడలతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని, చక్కటి గుర్తింపు లభిస్తుందని ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను గిరిజన క్రీడాకారులు అందిపుచ్చుకోవాలని చెప్పారు. స్థానిక హౌలీ క్రీడా మైదానంలో సోమవారం జరిగిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అంతకుముందు క్రీడాకారులను పరిచయం చేసుకుని, కొంతసేపు బ్యాట్ పట్టి క్రికెట్ ఆడారు. క్రికెట్ పోటీలో విజేతగా నిలిచిన జోలాపుట్టు, ద్వితీయ స్థానంలో నిలిచిన ఏనుగురాయి జట్లకు బహుమతులు అందజేశారు. అనంతరం వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన క్రీడాకారులు జాతీయ స్థాయి వరకు ఎదిగి రాష్ట్రానికి మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, ఎంపీడీవో కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్, సర్పంచ్‌లు బాబూరావు, నరసింగరావు, ఎంపీటీసీలు సుబ్బలక్ష్మి, గణపతి, వైఎస్సార్‌సీపీ నేతలు జయదేవ్, మూర్తి, తిరుపతిరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం సచివాలయ వ్యవస్థ

- ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



కరకగూడెంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

కూనవరం: గ్రామ స్వరాజ్యం కోసం జాతిపిత మహాత్మగాంధీ కన్న కలలను సచివాలయం వ్యవస్థ ద్వారా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. మండలంలో చినార్కూరు, జగ్గవరం, కరకగూడెం సచివాలయాల నూతన భవనాలను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు పాలనా యంత్రాంగం చేరువగా ఉండాలన్న సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారని చెప్పారు. గతంలో ఏ ధ్రువీకరణ పత్రం కావాలన్నా, ఏపనైనా జరగాలన్నా మండల కేంద్రానికి వెళ్లవలసి వచ్చేదని, దీంతో వ్యయ ప్రయాసాలకు గురికావలసి వచ్చేదని తెలిపారు. ఇప్పుడా పరిస్థితి లేదని, ఏ పనైనా క్షణాల్లో సచివాలయాల్లో జరుగుతోందని చెప్పారు. సచివాలయ, వలంటరీ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచినట్టు తెలిపారు. పొరుగు రాష్ట్రాల పాలకులు సైతం సచివాలయ వ్యవస్థను తమ రాష్ట్రాల్లో అమలు చేయాలని యోచిస్తున్నారని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యులు చిచ్చడి మురళి, ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, మండల జేసీఎస్ ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్, కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు, మేరుకులం, ఆరెకటిక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు దీకొండ గంగాధర్, అరవ వెంకటరామారావు, సర్పంచ్‌లు సున్నం అభిరామ్, కారం పార్వతి, నూపా వెంకన్నబాబు, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, మాజీ వైస్ ఎంపీపీ గుజ్జా బాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు కరకలక్ష్మి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఇంటి పూర్ణానందం, నాయకులు భరతమూర్తి, దివాకర్, పాపారావు, పూర్ణ, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యానికి అనుగుణంగా బోధన

- ఏపీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్

పాడేరు : సాంకేతిక విద్య బోధన విషయంలో అధ్యాపకులు తగిన మెలకువలను నేర్చుకోవాలని, నిత్యం విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తూ అందుకు అనుగుణంగా బోధన చేయాలని ఆంధ్రప్రదేశ్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్ తెలిపారు. సోమవారం ఆయన పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి, ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో శతశాతం అడ్మిషన్లు జరగడం గొప్ప విషయమన్నారు. అడ్మిషన్ల విషయంలో బాలికలు, బాలురకు సమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అధ్యాపకులకు గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ పెంచాలని సూచించారు. విద్యార్థులకు పరిశోధనలపై డిగ్రీ స్థాయిలోనే అవగాహన పెంచేలా సింగిల్ మేజర్ అనే నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చినట్టు చెప్పారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి కొద్దిసేపు థింసా నృత్యం చేశారు. కళాశాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లి వివిధ క్రీడా రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెడల్స్‌ను అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టిబ్బాయ్, వైస్ ప్రిన్సిపాల్ టి.ఎస్. రసూల్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ పి. కోటేశ్వరరావు, అరకువేలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చలపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్

'అనాథ పిల్లలకు అండగా ఉంటా'


చిన్నారులకు దుస్తులు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, హెచ్‌ఎం నాగేశ్వరరావు


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

- జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: తల్లిదండ్రులు లేక అనాథలైన పిల్లలకు అండగా ఉంటానని, దివ్యాంగుడైన వంతాల చిట్టిబాబు బాధ్యత నాది అని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు.మండలంలోని కుమడ పంచాయతీ సిర్లిమెట్ట గ్రామంలో ఏ అధారం లేక అభాగ్యులుగా ముగ్గురు పిల్లలు ఉన్నట్టు వచ్చిన కథనాలపై స్పందించిన జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర సోమవారం ఎంపీడీవో కిరణ్‌కుమార్, తహసీల్దార్ నర్సమ్మలతో సిర్లిమెట్ట గ్రామానికి వెళ్లారు. అక్కడ అనాత పిల్లల పరిస్థితిను చూసి చలించిపోయారు. ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందడం లేదని, ముఖ్యంగా దివ్యాంగుడైన చిట్టిబాబుకు పింఛన్ రావడం లేదని గ్రామస్తులు ఆమె తెలియజేశారు. దీంతో స్పందించిన చైర్‌పర్సన్ ఆయా అనాథ పిల్లలను ముంచంగిపుట్టు మండల కేంద్రానికి తీసుకువచ్చి జనన ధ్రువీకరణ పత్రాలను చేయించి, ఆధార్ కార్డులను తీయించారు. ఆధార్ కార్డు వచ్చిన వెంటనే రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, జాబ్ కార్డులను చేయిస్తామని, దివ్యాంగుడైన చిట్టిబాబుకు పింఛన్ మంజూరు చేయిస్తానని, ఇల్లు సైతం మంజూరు చేస్తానని, అన్ని విధాలుగా అండగా ఉంటానని ఆమె వారికి హామీ ఇచ్చారు.అనంతరం అనాథలైన ముగ్గురు పిల్లలకు విజయవాడ స్కూల్ చిల్డ్రన్ అండ్ ట్యుటోరియల్ అసోసియేషన్ సింగ్ నగర్ అందజేసిన రేషన్ సరుకులు, దుస్తులను జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర చేతుల మీదగా సంస్థ ప్రతినిధి, హెచ్‌ఎం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అందజేశారు.ఈ ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ మండల నేత మూర్తి తదితరులు పాల్గొన్నారు.

102 కిలోల గంజాయి స్వాధీనం


పట్టుబడ్డ గంజాయి, నిందితులతో పోలీసులు

మోతుగుడెం: చింతూరు మండలం మోతుగుడెం పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు సంఘటనల్లో 102 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ బి.గోపాలరావు సోమవారం తెలిపారు. చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఇన్నోవా వాహనంపై మహారాష్ట్రకు చెందిన నలుగురు వ్యక్తులు అక్రమంగా తరలిస్తున్న 100 కిలోల గంజాయిని గుర్తించినట్టు చెప్పారు . అలాగే మరో ఘటనలో 2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఆయా ఘటనల్లో నలుగురు నిందితులను అదుపులో తీసుకొని ,ఇన్నోవా వాహనాన్ని స్వాధీనం చేసుకొన్నట్లు ఆయన తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

వై.రామవరం: హత్యాయత్నం కేసులో సోమవారం ఒక నిందితుడిని స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై ఎమ్ సంతోష్‌కుమార్ వివరాల ప్రకారం... మండలంలోని చింతలపూడి పంచాయతీ వలస గ్రామానికి చెందిన పల్లాల చిన్నరామిరెడ్డి(52) తన భార్య సుబ్బమ్మ(48)ను మూడేళ్లగా అనుమానిస్తూ వేధిస్తుండేవాడు. ఈ నెల 17వ తేదీ రాత్రి 10 గంటలకు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో బాణంతో ఆమె డొక్కలో పొడిచాడు. ఆమె గట్టిగా కేకలు వేయగా, ఇరుగుపొరుగు రావడంతో నిందితుడు భయంతో పారిపోయాడు. తీవ్ర గాయంతో బాధపడుతున్న ఆమెను రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించగా, కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స చేయగా, ప్రాణాపాయ పరిస్థితి నుంచి బయట పడిందని ఎస్సై తెలిపారు. బాధితురాలి పెద్ద కుమార్తె రామలక్ష్మి(22) ఫిర్యాదు మేరకు పరారీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేసి, రంపచోడవరం కోర్టుకు హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు.

విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతికి కృషి

- కలెక్టర్ సుమిత్‌కుమార్

పాడేరు : సమాజంలో ట్రాన్స్‌జెండర్స్ ఒక భాగమని వారి ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు వారిని అన్ని విధాల ప్రోత్సాహిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ట్రాన్స్‌జెండర్స్‌కు విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మల్టీకుషన్ కుక్ శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రారంభించారు. ట్రాన్స్‌జెండర్స్‌పై చిన్న చూపు చూడవద్దని, వారిని కించపర్చవద్దన్నారు. వీలైతే గౌరవించాలని సూచించారు. వారి ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతులు శాఖ నిర్వహిస్తున్న 60రోజుల ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని హోటల్ రంగంలో రాణించాలన్నారు. తద్వార సొంతంగా హోటల్స్, రెస్టారెంట్లు, రిసార్టులు ఏర్పాటు చేసుకోవచ్చని సూచించారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ, జన శిక్షణ సంస్థ ప్రతినిధులు అప్పలనాయుడు, మనోహర్‌రావు, ధనుంజయరావు, తదితరులు పాల్గొన్నారు.


కుకింగ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభోత్సవానికి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

విభిన్న ప్రతిభావంతులకు అన్ని సౌకర్యాలు

విభిన్న ప్రతిభావంతుల ఉన్నతికి సంబంధిత శాఖ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం తన కార్యాలయం నుంచి వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమంపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామ సచివాలయల నుంచి విభిన్న ప్రతిభావంతుల వివరాలు సేకరించి వారికి అవసరమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కొంతమంది విభిన్న ప్రతిభావంతులు వ్యాపారం కోసం రుణాలు మంజూరు చేయాలని కోరగా లీడ్ బ్యాంకు మేనేజర్‌కు దరఖాస్తు చేసుకుంటే బ్యాంకు అధికారుల ద్వారా రుణాల మంజూరు చేస్తారని చెప్పారు. ఐటీడీఏ సబ్ కలెక్టర్లు ధాత్రిరెడ్డి, ప్రశాంత్‌కుమార్, చైతన్య, వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల శాఖ జిల్లా సహాయ సంచాలకులు జె.మాధవి, జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి వి.శేషమ్మ, సీనియర్ సిటిజన్స్ కమిటీ సభ్యులు, ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ధర్మయ్య, డెఫ్ అసోషియేషన్ అధ్యక్షుడు కుమారస్వామి, కార్యదర్శి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ సేవలు

- కలెక్టర్ సుమిత్‌కుమార్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పక్కన ఉపాధి కేంద్రం అధికారులు

పాడేరు : నిరుద్యోగ యువత ఆన్‌లైన్‌లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ సేవలు పొందవచ్చని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆన్‌లైన్ సేవలకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, కర పత్రాలను సోమవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు, రిజిస్ట్రేషన్ల కోసం ఇకపై ఎంప్లాయిమెంట్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. ఆన్‌లైన్‌లో ఈ పనులన్నీ చేసుకోవచ్చని చెప్పారు. గడువు తీరే ముందే అప్‌టుడేట్ చేసుకోవచ్చని, విద్యార్హతలు యాడ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఎంప్లాయిమెంట్.ఏపీ.జీవోవి.ఇన్ అనే వెబ్‌సైట్‌లో లాగిన్ అయితే లాగిన్ వివరాలు, తాత్కాలిక రిజిస్ట్రేషన్ నంబర్ సంబంధిత అభ్యర్థికి మెసేజ్ ద్వారా వస్తుందన్నారు. సంబంధిత అధికారి ఆమోదించిన తర్వాత అభ్యర్థికి ఎంప్లాయిమెంట్ నంబర్ తెలియజేస్తారని చెప్పారు. ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఐటీడీఏ పీవో వి.అభిషేక్ కూడా తన కార్యాలయంలో ఆన్‌లైన్ ప్రక్రియకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. జిల్లా ఉపాధి శిక్షణ అధికారి ఎ.సంగీత, ఉపాధి కార్యాలయ ఉద్యోగి బి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

కె.కోటపాడు : చౌడువాడ గ్రామానికి చెందిన కోమార నూకలక్ష్మి(32) పాముకాటుకు గురై ఆదివారం రాత్రి మృతి చెందింది. నూకలక్ష్మి ఆదివారం రాత్రి కల్లానికి నడుచుకొని వెళ్తుండగా ఎడమ కాలి బొటన వేలిపై పాముకాటు వేసింది. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు కె.కోటపాడు సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించాల్సిందిగా సూచించారు. దీంతో ఆమెను 108లో కేజీహెచ్‌కు తరలిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి భర్త అంజి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కె.కోటపాడు ఎస్‌ఐ ఆర్.ధనుంజయ్ కేసును నమోదు చేశారు. సోమవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు.

తూనికలు కొలతలపై అవగాహన అవసరం

- తూనికల కొలతలశాఖ డిప్యూటీ కంట్రోలర్ రవికుమార్
- పెదబయలు వారపు సంతలో తనిఖీలు
- 11 మందిపై కేసులు నమోదు


సంతలో కాటాలను తనిఖీ చేస్తున్న తూనికల కొలతలశాఖ డిప్యూటీ కంట్రోలర్ రవికుమార్

పెదబయలు: తూనికలు, కొలతలపై వినియోగదారులు అవగాహన పెంచుకోవాలని తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ కె.టి.రవి కుమార్ తెలపారు. స్థానిక సంతలో ఆయన సోమవారం తనిఖీలు చేశారు. కిరాణా,పాన్ షాపులు, వారపు సంతలో వ్యాపారుల కాటాలను పరిశీలించారు. కాటాల్లో వ్యత్యాసాలు ఎక్కువగా ఉండడం, ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు విక్రయిస్తుండగాన్ని గుర్తించి, 11 మందిపై కేసుల నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూనికల్లో మోసపోకుండా వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కచ్చితంగా తూకం వేయాలని, తరుగు పేరుతో కోతపెడితే సంబంధిత వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనకాపల్లి అసిస్టెంట్ కంట్రోలర్ బి.రామచంద్రయ్య, విశాఖ సిటీ ఇన్‌స్పెక్టర్ వి.రామారావు, నర్సీపట్నం, పాడేరు ఇన్‌స్పెక్టర్ డి.అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లిగెడ్డపై శరవేగంగా వంతెన నిర్మాణం

సీలేరు: ఆంధ్ర ఒడిశా సరిహద్దు సీలేరు సమీపంలోని పిల్లిగెడ్డపై వంతెన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని పంచాయతీరాజ్ డీఈ కల్యాణ్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో పిల్లి గెడ్డపై వంతెన మంజూరు కోసం కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని చెప్పారు. రిజర్వ్ ఫారెస్టు ప్రాంతంలో గెడ్డ ఉండడంతో డీఎల్‌వీ కమిటీ ద్వారా వంతెనను మంజూరు చేశారని చెప్పారు. పంచాయతీ రాజ్ ఎస్ఈ రవీందర్ ,ఈఈ లావణ్య కుమార్ పర్యవేక్షణలో శరవేగంగా వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఆయన అన్నారు.

రహదారి భద్రత వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


రహదారి భద్రత మాసోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: రహదారి భద్రత మాసోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. రహదారి భద్రత కార్యక్రమాలపై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధికారి లీలాప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోలీస్ కమాండో పోటీలు


సీఆర్‌పీఎఫ్ కమాండోలతో అతిథులు

విశాఖ స్పోర్ట్స్: అఖిల భారత పోలీస్ కమాండో పోటీలు తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యమిస్తుండగా విశాఖలోని గ్రేహౌండ్ గ్రౌండ్స్ వేదికగా ప్రారంభమయ్యాయి. పదహారు రాష్ట్రాల పోలీస్ కమాండోలతో పాటు ఏడు కేంద్ర పోలీసు బలగాల జట్లు తొమ్మిది రోజుల పాటు ఐదు దశల్లో పోటీపడనున్నాయి. నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ పోటీలను ప్రారంభించారు. తొలుత ఆతిథ్య ఆంధ్రప్రదేశ్ కమాండో జట్టుతో పాటు బీహార్, గుజరాత్, హర్యానా, జమ్ముకాశ్మీర్, ఝార్ఖండ్, కర్నాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, పంజాబ్, రాజస్తాన్, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరాఖండ్ కమాండో రాష్ట్ర జట్లు, కేంద్ర పోలీస్ బలగాల జట్లైన అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఆర్పీఎఫ్, ఎస్ఎస్‌బీలతో పాటు డిఫెండింగ్ చాంప్ హోదాలో ఐటీబీపీ కమాండో జట్లు అతిథులకు గౌరవవందనాన్ని సమర్పించాయి. ఈ సందర్భంగా సీపీ రవిశంకర్ మాట్లాడుతూ గ్రేహౌండ్స్ విభాగంలోని అసాల్ట్ కమాండర్‌గానే 1997లో తన కెరీర్ ప్రారంభం కాగా నేడు అదే విభాగం ఆధ్వర్యంలో ఏఐపీసీసీ ప్రారంభ వేడుకకు హాజరు కావడం గర్వంగా ఉందన్నారు. తొలుత కార్యక్రమానికి అధ్యక్షత వహించి గ్రేహౌండ్స్ ఏడీజీపీ రాజీవ్‌కుమార్ మీనా మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ పోటీలు నిర్వహించడం చక్కటి పరిణామమన్నారు. పోటీలకు సిద్ధమవుతున్న 23 జట్ల కమాండోలను అభినందించారు. నేవిగేషన్ దశతో పోటీలు ప్రారంభమై స్కిల్‌టెస్ట్, ప్లానింగ్ ఎగ్జిక్యూషన్, ఫిజికల్, ఫైరింగ్ రిఫ్లెక్లస్ కంబేట్ దశతో ముగియనున్నాయి. ఆయా జట్లు సాధించిన వ్యక్తిగత, జట్లు పాయింట్ల ఆధారంగా విజేతలకు 30వ తేదీన జరిగే ముగింపు కార్యక్రమంలో డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి చేతులు మీదుగా ట్రోఫీలు అందజేయనున్నారు. ఆపరేషన్స్ డీఐజీ కోయ ప్రవీణ్ పాల్గొన్నారు.


బెలూన్స్ ఎగురవేసి పోటీలను ప్రారంభిస్తున్న ఏడీజీపీ మీనా, నగర సీపీ రవిశంకర్ తదితరులు

న్యాయ సహాయకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

చోడవరం రూరల్: జిల్లాలోని పలు కోర్టుల పరిధిలో ప్రజలకు న్యాయ పరమైన సలహాలతోపాటు తగు న్యాయ సహాయం అందించాలన్న ఆసక్తి గల ఔత్సాహికుల నుంచి పారా లీగల్ వలంటీర్లు (న్యాయ సహాయకులు)గా పనిచేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సత్తి అరుణశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా జడ్జి ఆలపాటి గిరిధర్ ఉత్తర్వుల మేరకు జిల్లాలో 25 నుంచి 50 మంది వరకు న్యాయ సహాయకులను నియమిస్తామన్నారు. వీరికి శిక్షణ ఇస్తామని, ఏడాది పాటు సేవలందించాల్సి ఉంటుందన్నారు. ఎటువంటి పారితోషికం చెల్లించబోమన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా చోడవరం న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. కనీసం పదో తరగతి ఉత్తీర్ణత కలిగిన వారు దరఖాస్తుతోపాటు ఆధార్ కార్డు, విద్యార్హతల జెరాక్సు ప్రతులు, పాస్ పోర్టు సైజు, స్టాంప్ సైజు ఫొటోను జతపరచాలని తెలిపారు. వివిధ సేవా సంస్థల్లో పనిచేస్తున్న వారికి ఎంపికలో ప్రాధాన్యం ఉంటుందన్నారు.

సీఎం జగన్ సభను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు

చింతపల్లిరూరల్: విశాఖపట్నంలో ఈ నెల 27న జరిగే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు తెలిపారు. మండలకేంద్రంలో సోమవారం చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశాఖలో నిర్వహిస్తున్న భారీ సభతోనే ఎన్నికల శంఖారావం ప్రారంభమవతుందన్నారు. రాష్ట్రంలో 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ముఖ్యమంత్రి సందేశం ఇవ్వనున్నట్టు చెప్పారు. సీఎం జగనన్న మహసభకు అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపీలు అనూషదేవి, బోయిన కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, మండల పార్టీ అధ్యక్షుడు మోరిరవి, బొబ్బిలి లక్ష్మణ్, ట్రైకార్ డైరెక్టర్ లోవరాజు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి


దరఖాస్తులు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ ప్రశాంత్

రంపచోడవరం: ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్టు రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ తెలిపారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 అర్జీలను స్వీకరించినట్టు చెప్పారు. పందిరి మామిడి గ్రామం నుంచి వై రామవరం మండలం చవిటి దిబ్బలు గ్రామం మధ్యలో, భీమవరం, నరసాపురం గ్రామాల మధ్యలో సుమారు పది కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయిందని, వెంటనే పూర్తి చేయాలని గ్రామస్తులు దరఖాస్తు అందజేసినట్టు చెప్పారు.

కొత్త సూపర్ లగ్జరీలొస్తున్నాయ్!

- నెలాఖరుకు 32 బస్సుల రాక
- వీటిని దూర ప్రాంతాలకు నడిపే యోచనలో అధికారులు
- 3 నెలల్లో మరో 25 వరకు ఇతర బస్సులు వచ్చే అవకాశం

సాక్షి, విశాఖపట్నం: విశాఖకు కొత్త లగ్జరీ బస్సులొస్తున్నాయి. జిల్లాకు 50కి పైగా వివిధ రకాల బస్సులు అవసరం కానున్నాయి. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు కొన్నాళ్ల క్రితం యాజమాన్యానికి ప్రతిపాదనలు పంపారు. దీంతో ఉన్నతాధికారులు వాటిని మంజూరు చేశారు. ఇలా మంజూరైన బస్సుల్లో 32 బస్సులు సూపర్ లగ్జరీలున్నాయి. ఇవి నెలాఖరుకల్లా రానున్నాయి. వీటిని డిమాండ్, ప్రయాణికుల రద్దీ అవసరాలను దృష్టిలో ఉంచుకుని దూరప్రాంతాలకు నడపనున్నారు. ఇప్పటికే నిర్ణీత కిలోమీటర్ల దూరం ప్రయాణించిన, కండిషన్ బాగాలేని బస్సులను నిబంధనల ప్రకారం సర్వీసుల నుంచి తొలగించారు. వాటి స్థానంలో ఈ బస్సులను ప్రవేశపెట్టనున్నారు. అవసరానికి వినియోగించగా బస్సులు మిగిలి ఉంటే వాటిని స్పేర్‌గా ఉంచుతారు. మరోవైపు ఇప్పటికే మంజూరైన మిగిలిన బస్సుల్లో సూపర్ లగ్జరీలతో పాటు అల్ట్రా డీలక్స్‌లు, ఎక్స్‌ప్రెస్‌లు, పల్లె వెలుగులు, సిటీ బస్సులు ఉన్నాయి. ఈ సర్వీసులు మరో మూడు నెలల్లో విశాఖకు రానున్నాయని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు. దశల వారీగా వచ్చే ఈ సర్వీసులను ప్రజావసరాలను దృష్టిలో ఉంచుకుని వివిధ రూట్లకు కేటాయిస్తామని తెలిపారు. కాగా కాలం చెల్లిన (నిర్ణీత కిలోమీటర్లు పూర్తి చేసుకున్న) ప్పటికీ ఇంజిన్ కండిషన్ బాగున్న సూపర్ లగ్జరీ బస్సులను కూడా మరో విధంగా వినియోగంలోకి తెస్తున్నారు. ఇలాంటి బస్సుల ఛాసిస్‌లు మరికొన్నేళ్ల పాటు పనికొస్తాయి. దీంతో ఈ బస్సులకు విజయనగరంలోని జోనల్ వర్క్‌షాపులో సరికొత్తగా బాడీలు నిర్మిస్తున్నారు. వీటిని సిటీ, పల్లె వెలుగు బస్సులుగా నడపనున్నారు. ఫలితంగా కొత్తగా సిటీ/పల్లెవెలుగు బస్సులను కొనుగోలు చేయాల్సిన అవసరం కొంతవరకు తప్పుతుంది. విశాఖ జిల్లాకు కొత్త బస్సులు వస్తే ఇన్నాళ్లూ పాత బస్సులకు వెచ్చించే నిర్వహణ (మెయింటెనెన్స్) వ్యయం కూడా ఆర్టీసీ తగ్గుతుంది. అలాగే దూర ప్రాంత ప్రయాణికులకు కొత్త బస్సుల్లో ప్రయాణించడం వల్ల సౌకర్యవంతంగానూ ఉంటుంది.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు


రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులతో బద్రినాథ్

అనకాపల్లి : రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ఈనెల 19, 20, 21 తేదీల్లో తెనాలిలో జరిగిన పోటీల్లో మూడు పతకాలను సాధించినట్టు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.బద్రినాథ్ అన్నారు. విజేతలను ఆయన అభినందించారు. 83 కేజీల(జూనియర్) పురుషుల విభాగంలో ఆళ్ల సతీష్‌కు కాంస్యపతకం, 93 కేజీల (సీనియర్ విభాగంలో) కె.నరేంద్ర కాంస్య పతకం, బాలికల 76 కేజీల (సీనియర్ విభాగంలో) కె.ప్రవల్లిక రజత పతకం సాధించినట్టు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ కాండ్రేగుల శ్రీరామ్, గౌరవాధ్యక్షుడు కె.అప్పలనాయుడు పాల్గొన్నారు.